సాక్షి కామారెడ్డి

బుధవారం। 11। డిసెంబర్। 2024



దొంగలు పడ్డట్టుంది

కొత్త తెలంగాణ తల్లి విగ్రహం దొంగలు పడి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లుందని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి విమర్శించారు.

- 10లో ▸



ఆశావర్కర్ల అరెస్ట్

ఆశావర్కర్లు చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

- 11లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.6 /17.1

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'పార్టీ బలోపేతానికి కృషి చేయండి'



బిచ్కుంద: జుక్కల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సూచించారు. మంగళవారం బిచ్కుందలో బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గ నేతల సమావేశం నిర్వహించారు. రెండు నియోజకవర్గాలకు సంబంధించి పార్టీ క్రియాశీల సభ్యత్వం, స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపు అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా విఫలమైందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్‌పై వ్యతిరేకత పెరుగుతోందని, ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, నాయకులు శ్రీధర్ పంతులు, నరేందర్‌రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

'లింగ భేదం చూపొద్దు'



సదాశివనగర్: ఎవరూ జాతి, మత, లింగ భేదాలు చూపరాదని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి సూచించారు. హ్యూమన్ రైట్స్ డే సందర్భంగా మంగళవారం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలోని మహిళా సమాఖ్య భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. చిన్న చిన్న గొడవలకు కోర్టు వరకు రాకుండా చూసుకోవాలన్నారు. ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం రాజిరెడ్డి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి గణిత ప్రతిభా పరీక్ష

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ గంజ్ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లాస్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు గణిత ప్రతిభా పరీక్ష ప్రారంభమవుతుందని గణిత ఫోరం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో జరిగిన పరీక్షలో ప్రతిభ చూపినవారు జిల్లా స్థాయి పరీక్షకు హాజరు కావాలని సూచించారు. గైడ్ టీచర్లు విద్యార్థులు పరీక్షకు హాజరయ్యేలా చూడాలని కోరారు.

'పంచాయతీ'కి సిద్ధం!

- వార్డులవారీ ఓటరు జాబితాలు తయారు
- అందుబాటులో బ్యాలెట్ బాక్సులు
- 12 మంది నోడల్ అధికారుల నియామకం

పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వెలువడినా ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉంది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసింది. పోలింగ్ బూత్‌ల ఎంపికతోపాటు నోడల్ అధికారుల నియామకం ప్రక్రియలు పూర్తి చేశారు.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ఈ ఏడాది జనవరి 31 తో ముగిసింది. ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యేకాధికారుల పాలన మొదలయ్యింది. మొదట ఆరు నెలల పాటు ప్రత్యేకాధికారుల పాలన ఉంటుందని ప్రకటించారు. ఎన్నికలు నిర్వహించకపోవడంతో మరో ఆరు నెలలు పొడగించారు. దీంతో ప్రత్యేకాధికారుల పాలన మొదలై పది నెలలు దాటింది. ఎన్నికల నిర్వహణకు ఈనెలలో షెడ్యూల్ వెలువడితే జనవరి, ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయని భావిస్తున్నారు.

జిల్లాలో 535 పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో 4,686 వార్డులున్నాయి. పంచాయతీలతో పాటు వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లతో అధికారులు సిద్ధంగా ఉన్నారు. పోలింగ్ నిర్వహణకు 4,697 పోలింగ్ బూత్‌లను కూడా ఎంపిక చేశారు. ఇప్పటికే వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు తయారు చేశారు. పోలింగ్ నిర్వహణకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను కూడా రెడీ చేసి పెట్టారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన విధివిధానాలకు సంబంధించిన బుక్‌లెట్లు, ఓటరు జాబితాలన్నీ ఇప్పటికే రెడీ అయ్యాయి. ఎప్పుడు ఎన్నికల షెడ్యూల్ వెలువడినా ఎలాంటి ఆటంకం లేకుండా నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉంది.



పంచాయతీ ఎన్నికల కోసం బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తున్న సిబ్బంది



సిద్ధంగా ఉన్న ఓటరు జాబితాలు

ఎన్నికల నిర్వహణకోసం..

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు వివిధ బాధ్యతలు చూడడానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ 12 మంది జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. ఎన్నికల సిబ్బంది నియామకానికి సంబంధించి మ్యాన్‌పవర్ నోడల్ అధికారిగా సీపీవో ఆర్.రాజారాం, బ్యాలెట్ బాక్సుల మేనేజ్‌మెంట్‌కు నోడల్ అధికారిగా డీఆర్‌డీవో ఎం.సురేందర్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్‌కు సివిల్ సప్లైస్ డీఎం జి.రాజేందర్, శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారిగా డీఈవో ఎస్.రాజు, మెటీరియల్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారిగా జిల్లా హార్టికల్చర్ అధికారి ఎం.జ్యోతి, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఖర్చుకు సంబంధించి నోడల్ అధికారిగా డీపీవో తిరుమల ప్రసాద్, ఖర్చుల పర్యవేక్షణ అధికారిగా ఆడిట్ ఆఫీసర్ జే.కిషన్ పామర్, పరిశీలకుడిగా జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింహారావు, బ్యాలెట్ పేపర్స్ నోడల్ అధికారిగా జెడ్పీ సీఈవో చందర్, హెల్ప్‌లైన్, ఫిర్యాదుల స్వీకరణకు జిల్లా భూగర్భ జల శాఖ అధికారి ఎం.సతీష్ యాదవ్, రిపోర్ట్స్', రిటర్న్స్‌కు జిల్లా మత్స్యశాఖ అధికారి పి.శ్రీపతి, మీడియా కమ్యూనికేషన్స్ నోడల్ అధికారిగా డీపీఆర్‌వో భీమ్‌కుమార్ నియమితులయ్యారు.

నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండగా.. నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందా అని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. బిల్లులు రాక, పనులు జరగక గత పంచాయతీ పాలక వర్గాలు కొంత ఇబ్బంది ఎదుర్కొన్నప్పటికీ పంచాయతీ పాలన చేతుల్లో ఉండాలని చాలా మంది ఆరాటపడుతున్నారు. కొందరైతే ఇప్పటికే డబ్బులు రెడీ చేసుకుని ఉన్నారు. గతంలో చాలా పంచాయతీల్లో ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. అయితే ఈసారి ఏకగ్రీవాలు అంత సులువు కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఊరూరా ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు రాజకీయంగా ఎదగడానికి పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ పదవులు మొదటి మెట్టుగా భావిస్తారు. ఎన్నికల్లో ఎలాగైనా నిలబడి, ఎంతైనా ఖర్చు చేసి విజయం సాధించాలన్న పట్టుదలతో చాలా మంది ఇప్పటికే ప్రయత్నాలు చేస్తున్నారు. షెడ్యూల్ వెలువడితే బరిలో నిలిచేందుకు రెడీ అవుతున్నారు.

'పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి'



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్

కామారెడ్డి టౌన్: రాష్ట్ర మంత్రివర్గ ఉప సంఘం హామీ ఇచ్చిన విధంగా ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో ఫెడరేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. 2024 మార్చి నుంచి ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు పెన్షన్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడం సరికాదన్నారు. గ్రాట్యుటీ, జీపీఎఫ్ డబ్బులు కూడా విడుదల చేయాలన్నారు. బిల్లుల విడుదలలో పైరవీలకు ఆస్కారం ఇచ్చేలా కొన్ని సంఘటనలు వెలుగు చూడడం విచారకరమన్నారు. 317 జీవో బాధితులందరికి న్యాయం చేయాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఫెడరేషన్ ప్రతినిధులు సీహెచ్ లక్ష్మి, విజయశ్రీ, హరిసింగ్, నరేందర్, గోపి, శ్రీనివాస్, ప్రకాశ్, కృష్ణ, హరీష్, భగత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక



లింగం, శ్రీనివాస్‌రెడ్డి

టీపీటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతల లింగం, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు.

'క్రమబద్ధీకరించే వరకు సమ్మె'



ప్రతిజ్ఞ చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించేంత వరకు సమ్మెను విరమించేది లేదని సమగ్ర శిక్ష ఉద్యోగులు స్పష్టం చేశారు. తమ డిమాండ్‌లను పరిష్కరించాలని నాలుగు రోజులపాటు నిరసన దీక్షలు చేసినా ప్రభుత్వం స్పందించకపోవడంతో మంగళవారం నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరంలో కూర్చున్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఉద్యోగుల హక్కులను కాపాడాలని కోరుతూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెతో గురుకుల, కస్తూర్బా, ప్రభుత్వ పాఠశాలలు, భవిత సెంటర్‌లలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సేవలు నిలిచిపోయాయి. తెలంగాణ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్‌రావు సమ్మెకు మద్దతు తెలిపారు. సమ్మెలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలపాలి

కామారెడ్డి క్రైం: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రూపొందించిన ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే గురువారంలోపు తెలియజేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7న గ్రామ పంచాయతీలలో ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాను ప్రదర్శించామన్నారు.

గురువారం అన్ని మండలాల పరిధిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవోలు సమావేశాలు నిర్వహించి, అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. వచ్చిన అభ్యంతరాలను 13 వ తేదీన పరిష్కరిస్తారన్నారు. ఈనెల 17న అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రకటిస్తామని తెలిపారు.

వచ్చేనెలలో తుది జాబితా..

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ద్వారా జుక్కల్ నియోజకవర్గంలో 14,043, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 14,319, కామారెడ్డి నియోజకవర్గంలో 23,352 అభ్యంతరాలు, దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. వాటిని ఈనెల 24 లోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వచ్చేనెల 6వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని పేర్కొన్నారు. బూత్ స్థాయి ఏజెంట్‌లను నియమించుకోవాలని పార్టీల ప్రతినిధులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్‌రావు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదంలో అడవి జంతువు

అటవీ శాఖ అడవుల రక్షణకే ప్రాధాన్యత ఇస్తూ.. జంతు సంరక్షణకు కనీస చర్యలు చేపట్టకపోవడంతో వాటి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. వేటగాళ్ల ఉచ్చుకు కొన్ని బలవుతుండగా, అడవులను దాటే క్రమంలో రోడ్డు, రైలు ప్రమాదాల బారిన పడి మరికొన్ని మృత్యువాత పడుతున్నాయి. దీంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో వివిధ రకాల అటవీ జంతువుల మనుగడ తగ్గిపోతోంది.



కనిపించని సంరక్షణ చర్యలు

- హైవే, రైలు పట్టాలపైనే ఎక్కువ ప్రమాదాలు
- తరచూ మృత్యువాత పడుతున్న చిరుతలు, ఇతర జంతువులు



హైవేపై ప్రమాదానికి గురైన చిరుత(ఫైల్)

ఉమ్మడి జిల్లాలో అడవుల విస్తీర్ణం (హెక్టార్లలో)

కామారెడ్డి	82,190.48
నిజామాబాద్	86,871.45
ఇందల్వాయి రేంజ్	22,748.41
సిరికొండ రేంజ్	15,544.71

డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలను కలుపుతూ అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల గుండా 44వ నంబరు జాతీయ రహదారితో పాటు రైల్వే ట్రాక్ ఉంది. వీటిని దాటే క్రమంలో వన్యప్రాణులు ప్రమాదాలకు గురై చనిపోతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వాటిలో చిరుతలే ఎక్కువగా ఉంటున్నాయి. రోడ్లపై చిరుతలు, జంతువులను చూసి వాహనదారులు భయపడి వారూ ప్రమాదాలకు గురవుతున్నారు.

పరిష్కార మార్గాలున్నప్పటికీ..

సాధారణంగా అటవీ జంతువులు ఆహారం కోసం లేదా నీటి కోసం రోడ్డును, రైలు పట్టాలను దాటి వెళ్తుంటాయి. ప్రధానంగా చిరుతలు రాత్రుల్లో ఎక్కువగా వేటాడుతాయి. అందుకే రోడ్లపై వీటి సంచారం ఎక్కువగా ఉంటుంది. హైవేపై వేగంగా వచ్చే వాహనాలు వీటిని ఢీకొంటున్నాయి. తాజాగా సదాశివనగర్ మండలం దగ్గి అటవీ ప్రాంతంలోని హైవేపై ఓ చిరుతను వాహనం ఢీకొట్టింది. దానికి తీవ్రగాయాలు కాగా అక్కడి నుంచి అడవిలోకి వెళ్లిపోయింది. అంతకు ముందు కూడా ఇదే ప్రాంతంలో చిరుతలు మృత్యువాత పడినట్లు అటవీ అధికారులు పేర్కొంటున్నారు. పక్కనే ఇందల్వాయి దగ్గర గతంలో రైల్వే ట్రాక్‌పై రైళ్లు ఢీకొని రెండు చిరుతలు మరణించాయి. వన్యప్రాణులు రోడ్లు, రైల్వేట్రాక్‌లు దాటకుండా ఉండాలంటే అండర్‌పాస్ బ్రిడ్జీలు ఏర్పాటు చేయడమే పరిష్కార మార్గమని అధికారులు చెబుతున్నారు. అలాగే అడవి ఎక్కడి వరకు ఉంటే అక్కడి వరకు రోడ్డుకు, రైల్వే ట్రాక్‌కు రెండు వైపులా ఫెన్సింగ్ వేస్తే కూడా జంతువులు బయటకు రాకుండా ఉంటాయని అంటున్నారు. ప్రమాదాల బారిన పడకుండా అండర్‌పాస్ బ్రిడ్జీలు ఏర్పాటు చేయాలని, అప్పుడు వీటి కింది నుంచి వన్యప్రాణులు వెళ్తాయని చాలాసార్లు హైవే అథారిటీకి లేఖలు రాసినట్లు అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. వారు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

లెక్కల్లేవ్!

ఉమ్మడి జిల్లా పరిధిలో రోడ్డు, రైలు ప్రమాదాల్లో ఇప్పటి వరకు ఎన్ని చిరుతలు, జంతువులు మృత్యువాత పడ్డాయో అటవీ శాఖ వద్ద సరైన వివరాలు లేనట్లు తెలుస్తోంది. ఈ వివరాల కోసం 'సాక్షి' ప్రయత్నించగా సంబంధిత అటవీ శాఖ సెక్షన్ అధికారులు చెప్పలేకపోయారు. వివరణ కోసం రెండు జిల్లాల డీఎఫ్‌వోలకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు.

జిల్లాలో వన్యప్రాణుల వివరాలు

చిరుతలు	25	నెమళ్లు	315
ఎలుగుబంట్లు	32	మనుబోతులు	368
అడవి కుక్కలు	35	నక్కలు	16
అడవి పిల్లులు	25	తోడేళ్లు	11
జింకలు	295	హైనాలు	– 4

నాలుగుచోట్ల అండర్‌పాస్ బ్రిడ్జీలు అవసరం



జిల్లాలోనే అత్యధిక అడవులు, చిరుతలు ఉన్న రేంజ్ ఇందల్వాయి ఒక్కటే. కామారెడ్డి అడవులు దగ్గరగా ఉండడంతో చిరుతలు అటూ ఇటూ వెళ్తాయి. అడవుల మీదుగా ఉన్న రోడ్డును దాటే క్రమంలో ప్రమాదాలకు గురై మరణిస్తున్నాయి. ప్రమాదాలను నివారించడానికి సదాశివనగర్ నుంచి ఇందల్వాయి రేంజ్ వరకు రహదారిపై అండర్‌పాస్ బ్రిడ్జిలు నాలుగు చోట్ల ఏర్పాటు చేస్తే సరిపోతుంది. అడవికి రెండు వైపులా ఫెన్సింగ్ వేయాలని ఉన్నతాధికారులను కోరుతాం. – రవిమోహన్ భట్, ఫారెస్ట్ రేంజ్ అధికారి, ఇందల్వాయి

'గ్రూప్–2'ను పకడ్బందీగా నిర్వహించాలి

- పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయండి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి క్రైం: జిల్లాలో గ్రూప్– 2 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈనెల 15, 16 తేదీల్లో గ్రూప్ –2 పరీక్షలు జరుగుతాయన్నారు. 8,085 మంది అభ్యర్థులకోసం 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయా సెంటర్లలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. బయోమెట్రిక్ హాజరు కోసం సిబ్బందిని నియమించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, పరీక్షల రీజనల్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.


ఈవీఎం గోదాం పరిశీలన



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఓటింగ్ యంత్రాలు, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో రంగనాథ్‌రావు, తహసీల్దార్ జనార్దన్ ఉన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, పక్కన ఎస్పీ సింధు శర్మ

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి సంబంధిత శాఖల అధికారులు నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. నివారణ చర్యలు చేపట్టిన వివరాలతో పాటు ఫొటోలను సమర్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ, రాష్ట్రీయ రహదారులపై తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట విద్యుత్ దీపాలు, సూచికలు వంటివి ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్లకు ఇరువైపులా అనధికారికంగా ఏర్పాటుచేసిన, రవాణాకు ఇబ్బంది కలిగే టీ, టిఫిన్ సెంటర్లను తొలగించాలన్నారు. గత సమావేశంలో చర్చించిన పనులను ఆయా శాఖల అధికారులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రమాదాలను నివారించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సింధు శర్మ సూచించారు. సమావేశంలో జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ సీఎస్ రావు, ఆర్అండ్‌బీ ఈఈ రవిశంకర్, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, డీపీవో శ్రీనివాస్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్నూర్‌కు కేంద్రీయ విద్యాలయం

మద్నూర్: మద్నూర్‌లో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించడానికి విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండల కేంద్రంలో భవన నిర్మాణం కోసం 10 ఎకరాల భూమిని గుర్తించామని డీఈవో రాజు తెలిపారు. కేంద్రీయ విద్యాలయం నిబంధనల ప్రకారం కేంద్రీయ విద్యాలయ సిబ్బంది తాత్కాలికంగా నివాసం ఉండడానికి 15 గదులను సిద్ధం చేయాలని బాన్సువాడ సబ్ కలెక్టర్‌ను కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కామారెడ్డి టౌన్: జిల్లా ఉద్యమ నిరుద్యోగుల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జిల్లా అధ్యక్షుడు సొంటెం సాయిలు మాట్లాడుతూ.. కళాకారులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రకటించిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కళాకారులు అన్న బోయిన శ్రీనివాస్, రాజలింగం, శ్రీనివాస్ తదితరులున్నారు.

సోనియా రూపంలో తెలంగాణ తల్లి విగ్రహం

రాజంపేట: సీఎం రేవంత్ రెడ్డి సచివాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం సోనియా గాంధీ రూపంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహమని బీజేపీ రాజంపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తుల నరేందర్ ఓ ప్రకటనలో విమర్శించారు. నాడు సోనియాను బలిదేవత అని తిట్టిన రేవంత్ ఆమె ప్రసన్నం కోసమే సోనియా రూపంలో తెలంగాణ తల్లి విగ్రహం మార్పు చేశారని, పదవి కోసం తెలంగాణ తల్లినే మార్చిన ఘనుడు రేవంత్ రెడ్డి అని విమర్శించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట, బొల్లారం గ్రామాలలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కాంగ్రెస్ నేతలు పంపిణీ చేశారు. కాంగ్రెస మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, నాగిరెడ్డిపేట గ్రామ అధ్యక్షుడు సాయాగౌడ్, నాయకులు ధనుంజయ్, ప్రభుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కూల్ వాటర్ క్యాన్లు..

భిక్కనూరు: తిప్పాపూర్‌లో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా కూల్ వాటర్ క్యాన్లను మంగళవారం పంపిణీ చేశారు. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుంట లింగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యావర సాయిరెడ్డి, ప్రతినిధులు పైడి సాయిరెడ్డి, ఎన్గు బాల్‌రాజు రెడ్డి, తదితరులుపాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహంపై దొంగలు పడ్డట్టుంది

- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- బాన్సువాడలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం



తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

బాన్సువాడ : హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం.. దొంగలు పడి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు ఉందని బాన్సువాడ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. మంగళవారం బాన్సువాడ అంబేడ్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ ఇంట్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను నేరవేర్చకుండా రాజకీయాలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఆయన మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టడం తప్ప రాష్ట్ర ప్రయోజనాలకు పని చేసింది ఏమీ లేదన్నారు. 50 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ జరగలేదన్నారు. కొత్త పింఛన్లు, ఆడపిల్ల పెళ్లికి ఇస్తామన్న తులం బంగారం ఏమయ్యాయని ప్రశ్నించారు. రూ. లక్షన్నర కోట్లతో మూసీ నది ప్రక్షాళన చేస్తామని సీఎం అంటున్నారని, రాష్ట్ర బడ్జెట్‌లో సగం ఒక్క నదికే పెడితే ఇక రాష్ట్రాన్ని ఏ విధంగా నడిపిస్తారో చెప్పాలన్నారు. బాన్సువాడ ప్రజలు బీఆర్‌ఎస్‌కు ఓట్లేసి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆయన కుటుంబం కోసం పార్టీ మారారని విమర్శించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే ఆయనకు గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, బీఆర్‌ఎస్ నాయకులు మోచి గణేష్, సాయిబాబా, రమేష్‌యాదవ్, మల్లేష్‌గౌడ్, మహేష్, సద్దాం, మౌల, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో విఫలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు వజ్జపల్లి తండాలో గల తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహం మార్పు చేసినందుకు నిరసనగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నాగాగౌడ్, మాజీ జెడ్పీటీసీ కమిలి నర్సింలు, మాజీ సర్పంచ్‌లు అనిల్‌కుమార్, మోహన్ నాయక్, లత రమేశ్, బద్దం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ చందర్ రావు, ఎడ్ల రేణుకా నర్సింలు, విండో చైర్మన్ ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తల్లిని వ్యతిరేకిస్తున్నాం



పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే సింధే

బిచ్కుంద(జుక్కల్): సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లిని కాకుండా కాంగ్రెస్ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్నారు.. దీన్ని బీఆర్‌ఎస్ పార్టీ వ్యతిరేకిస్తోందని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. మంగళవారం బిచ్కుందలో మినీ ట్యాంక్ బండ్ వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇచ్చిన హామీలు ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన తెరపైకి తీసుకొచ్చారని విమర్శించారు. ఆనాడు తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వారు తెలంగాణ తల్లి పేరుతో విగ్రహం ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సొసైటీ చైర్మన్ బాలాజీ, పార్టీ అధ్యక్షుడు వెంకట్‌రావు, నాయకులు నాల్చర్ రాజు, అన్వరుల్లా, మల్లికార్జున్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం



ఎల్లారెడ్డిలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



చిన్నమల్లారెడ్డి గ్రామంలో..



తాడ్వాయి మండల కేంద్రంలో..



రామారెడ్డిలో..

సాక్షి నెట్‌వర్క్:బీఆర్‌ఎస్ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో పలు చోట్ల తెలంగాణ తల్లి విగ్రహాలకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం పాలాభిషేకం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో కాంగ్రెస్ తల్లిని ఆవిష్కరించి తెలంగాణ తల్లిని అవమానించారని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

జాగృతిలో చేరిన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్



ఎమ్మెల్సీ కవిత సమక్షంలో చేరిన సంపత్ గౌడ్

లింగంపేట(ఎల్లారెడ్డి): జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్ గౌడ్ తెలంగాణ జాగృతిలో మంగళవారం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా కవిత, సంపత్‌గౌడ్‌కు కండువా కప్పి సంస్థలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంస్థ ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. సంపత్‌గౌడ్ గతంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా , లింగంపేట సింగిల్ విండో చైర్మన్‌గా, జిల్లా సింగిల్ విండో డైరెక్టర్‌గా పని చేసిన అనుభవం ఉందన్నారు. ఆయనపై ఉన్న నమ్మకంతో జాగృతిలోకి తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సంపత్‌గౌడ్ మాట్లాడారు. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కవితకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, రాష్ట్ర నాయకులు రాజీవ్‌సాగర్, నవీన్ ఆచారి, నరేందర్‌యాదవ్, ఈగ సంతోష్, లలితయాదవ్ పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కోసం విస్తృత ప్రచారం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

దోమకొండ: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఎయిడ్స్‌పై అవగాహన కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. సంచార వాహనంలో ఎల్ఈడీ చిత్ర ప్రదర్శనలతో కామారెడ్డి జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాధిక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హెచ్ఐవీని నివారించడానికి అవగాహన ముఖ్యమని భావించి ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేశామన్నారు. 2030 నాటికి హెచ్ఐవీని నిర్మూలించే దిశగా అందరూ భాగస్వాములు కావాలని కోరారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రభుకిరణ్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎస్సై ఆంజనేయులు, పంచాయితీ కార్యదర్శి యాదగిరి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డీపీఎం చల్లా సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాతలను అభినందిస్తున్న కలెక్టర్

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా ట్రెజరీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రక్తదానం చేసిన ట్రెజరీ శాఖ అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఇలాంటి శిబిరాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ రాజన్న, జిల్లా కోశాధికారి వెంకటేశ్వర్లు, టీఎన్‌జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ఎస్‌టీవో సాయిరెడ్డి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు దేవేందర్, పీవీ నరసింహం, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



బాన్సువాడలో మాట్లాడుతున్న ఉద్యమకారులు

బాన్సువాడ: మలిదశ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మలిదశ ఉద్యమకారులు అన్నారు. మంగళవారం వారు బాన్సువాడలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా మలిదశ ఉద్యమకారులకు 250 గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా మలిదశ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించలేదని అన్నారు. సమావేశంలో మలిదశ ఉద్యమకారులు ఎర్రవాటి సాయిబాబా, చందు, ఉడత గంగాధర్, దండు విజయ్, తదితరులున్నారు.

పౌష్టికాహారాన్ని అందించాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాలని మండల ప్రత్యేకాధికారి చందర్ నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ గంగాసాగర్, సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ టీచర్లు సునంద, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

కల్కి ఆలయ వార్షికోత్సవం

కామారెడ్డి అర్బన్: స్థానిక పరంజ్యోతి భగవతి భగవాన్ శ్రీకల్కి ఆలయం 23వ వార్షికోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా మంగళవారం నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. మున్సిపల్ చైర్ పర్సన్ జి.ఇందుప్రియ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పప్పుల రాజేందర్ దంపతులు, వార్డు కౌన్సిలర్ సుగుణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరు మారుతి దంపతులు, ప్రతినిధులు బాలు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పరిస్థితి విషమించి మృతి

- తండ్రి భూమి పంచివ్వడంలేదని పురుగుల మందు తాగిన కొడుకు
- ఆస్పత్రిలో మృతి



బుయ్య పెంటయ్య మృతదేహం

లింగంపేట(ఎల్లారెడ్డి): తండ్రి భూమి పంచివ్వడం లేదని మండలంలోని మోతె గ్రామానికి చెందిన బుయ్య పెంటయ్య(37) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. భూమిని కౌలుకు ఇవ్వడం లేదని, అలాగే తనకు వాటాగా రావాల్సిన భూమిని పంచివ్వడం లేదని తండ్రి రాములుకు పెంటయ్యకు గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పెంటయ్య మనస్తాపానికి గురై ఈ నెల 2వ తేదీన పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య రమాలీల, ఇద్దరు పిల్లలు ఉన్నారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని ఇద్దరి దుర్మరణం



జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలం సికింద్రాపూర్ గ్రామ శివారులోని 44వ నంబర్ జాతీ య రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. నిజామాబాద్ నగరానికి చెందిన కస్తూరి ప్రమోద్ (21), అంకడి సంజయ్(22) పల్సర్ బైక్ పై ఆర్మూర్ నుంచి నిజామాబాద్‌కు వెళ్తుండగా మంగళవారం రాత్రి 8 గంటలకు ఈ ప్రమా దం జరిగింది. ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు



క్షతగాత్రులను 108లో తరలిస్తున్న సిబ్బంది

లింగంపేట(ఎల్లారెడ్డి): అంత్యక్రియలకు వెళ్తుండగా చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మోతె గ్రామానికి చెందిన బుయ్య కుర్మ పెంటయ్య అంత్యక్రియలకు హాజరయ్యేఏందుకు గాంధారి మండలం సీతాయిపల్లి గ్రామానికి చెందిన పలువురు ట్రాలీ ఆటోలో వెళ్తుండగా టైర్ పేలి ఆటో బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న చందం శ్యామల, చాకలి లక్ష్మవ్వ, లంక లక్ష్మి, మొగుళ్ల శ్యామల, సురేశ్, శెట్కూరి శ్యామల, మంజుల, భైరవ్వ, కాశీరాం, విఠవ్వతోపాటు మరి కొంత మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోచమ్మగల్లీలో స్రవంతి(32) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి మంగళవారం తెలిపారు. పోచమ్మగల్లీకి చెందిన మేఘరాజ్‌తో స్రవంతికి మూడేళ్ల క్రితం వివాహమైందని, వారికి ఒక పాప ఉందని తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని కల్కినగర్‌కు చెందిన ఆంజనేయులు(42) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు పెద్ద చెరువులో పడి మృతి చెందాడు. రేడియం దుకాణంలో పని చేసే ఆంజనేయులు సోమవారం రాత్రి ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం ఉదయం శవమై తేలాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

పైడిమల్‌కు చెందిన వ్యక్తి..

వర్ని: మండలంలోని పైడిమల్ గ్రామానికి చెందిన మాల రాములు(38) ప్రమాదవశాత్తు సైదిపూర్ ఊర చెరువులో పడి మంగళవారం మృతి చెందినట్లు వర్ని ఎస్సై రమేశ్ తెలిపారు. చెరువులో దిగిన పశువులను బయటకు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న రాములు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడన్నారు. మృతుని తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



నిజాంసాగర్(జుక్కల్): నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్ల వద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు తమకు సమాచారం అందిందని ఎస్సై శివకుమార్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, కుడి చేతిపై టాటూ ఉందన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఎస్‌హెచ్‌వో 87126 86172 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఇరువర్గాలపై కేసు

నవీపేట: కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం రాత్రి మండల కేంద్రంలో జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్ మంగళవారం తెలిపారు. కానిస్టేబుల్ యాదగిరి కుటుంబంలో గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. సోమవారం రాత్రి యాదగిరి ఇంటికి ఆయన చెల్లెలు భర్త రమేశ్, అల్లుడు గంగాధర్ వచ్చారన్నారు. వారితో కలిసి యాదగిరి తన భార్య ఇందిర, కొడుకు అరవింద్‌తో ఘర్షణకు దిగాడు. అరవింద్‌పై పదునైన ఆయుధంతో వారు దాడి చేశారన్నారు. ఇందిర ఫిర్యాదు మేరకు యాదగిరి, రమేశ్, గంగాధర్‌పై కేసు నమోదు చేశామన్నారు. అలాగే యాదగిరిపై దాడికి పాల్పడిన భార్య ఇందిర, కొడుకు అరవింద్‌తోపాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రుద్రూర్: పోతంగల్ మండలం కోడిచర్ల శివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి మైనింగ్ అధికారులకు సమాచారం అందించామన్నారు. పోలీస్, రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నప్పటికీ ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. మంజీరా నది సమీపంలో, గుట్ట ప్రాంతాల్లో అక్రమార్కులు ఇసుక డంప్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

మోపాల్ పోలీస్ స్టేషన్ తనిఖీ

నిజామాబాద్ రూరల్: మోపాల్ పోలీస్ స్టేషన్‌ను ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను, సిబ్బంది పరేడ్ డ్రిల్, కిట్టు లను పరిశీలించారు. అనంతరం పెట్రోలింగ్, బీట్ తదితర వివరాలు తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సిబ్బందికి సూచించారు. పెట్రోలింగ్ చేయాలని, సైబర్ నేరాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. సీఐ సురేశ్‌కుమార్, ఎస్సై యాదగిరి గౌడ్, ఏఎస్సై దయాల్‌సింగ్, రమేశ్, సిబ్బంది ఉన్నారు.

వేర్వేరు చోట్ల రెండు లారీలు బోల్తా

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ముస్తాపూర్ మూలమలుపు వద్ద మంగళవారం మక్కల లారీ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఔరంగబాద్ నుంచి కామారెడ్డి వైపు మక్కలలోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. అలాగే లింగంపేట వైపు నుంచి ఎల్లారెడ్డి వైపు బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీ మెంగారం గ్రామ శివారులోని మిద్దెమిట్టు వద్ద బోల్తాపడింది.

ఆస్పత్రి భవనం పై నుంచి దూకి రోగి ఆత్మహత్య

- అనారోగ్య సమస్యతో మనస్తాపానికి గురై అఘాయిత్యం



లక్ష్మణ్ (ఫైల్)

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి ఆస్పత్రి భవనం పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని నాగారం ప్రాంతానికి చెందిన చాట్ల లక్ష్మణ్ (46) అనారోగ్యంతో ఈ నెల 7న ఆస్పత్రిలో చేరాడు. రెండో అంతస్తులో చికిత్స పొందుతున్న లక్ష్మణ్‌కు గుండె సమస్య తీవ్రం కావడంతో పాటు శరీరంలో వాపులు వచ్చాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో తన భార్య టీ తీసుకురావడానికి బయటకు వెళ్లగానే లక్ష్మణ్ ఆస్పత్రి 6 వ అంతస్తు పైకి ఎక్కి లోపలి కారిడార్‌లోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆస్పత్రి అధికారులకు సమాచారం అందించారు. 15 నిమిషాల్లోనే మృతదేహాన్ని పోస్టుమార్టం గదికి తరలించారు. ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కాగా లక్ష్మణ్ ఆత్మహత్యకు అనారోగ్యమే కారణమా! ఇంకేమైన కారణాలు ఉన్నాయో అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆస్పత్రిలో 200 పైగా సీసీ కెమెరాలు, పోలీసులు, ప్రతి ఫ్లోర్‌లో సరిపడా సెక్యూరిటీ సిబ్బంది ఉన్నా ఆత్మహత్య ఘటన జరగడం పై చర్చనీయాంశమైంది.

గోదావరిలో దూకి ఆత్మహత్య



సంతోష్‌గౌడ్(ఫైల్)

నవీపేట: మండలంలోని యంచ శివారులోని గోదావరిలో దూకి ఫకీరాబాద్ గ్రామానికి చెందిన కొండా సంతోష్‌గౌడ్ (40) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. గత ఎనిమిది నెలలుగా గుర్తు తెలియని మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న సంతోష్‌గౌడ్ మానసిక ఆందోళనకు గురయ్యాడని పేర్కొన్నారు. ఆరు నెలల క్రితం గోదావరిలో దూకేందుకు వెళ్లగా యంచ గ్రామస్తులు కాపాడారని పేర్కొన్నారు. మంగళవారం కల్లు దుకాణం తెరిచిన తరువాత గోదావరి నది వైపు స్కూటీపై వెళ్లిన సంతోష్‌గౌడ్ తన స్నేహితుడికి ఫోన్ చేసి గోదావరి దూకుతున్నట్లు తెలిపాడు.మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు..

కామారెడ్డి క్రైం: అనారోగ్య కారణాలతో ఓ వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డిలోని రాజీవ్‌నగర్ కాలనీలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.

కాలనీకి చెందిన కెంగర్ల మల్లయ్య (70) గత ఐదేళ్లుగా బీపీ, షుగర్, ఇతర అనారోగ్య కారణాలతో బాధపడుతున్నాడు. భార్య మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, జీవితంపై విరక్తి చెందిన మల్లయ్య సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.